క్లుప్తంగా

దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు



కొనసాగుతున్న రోడ్డు మరమ్మతు పనులు..

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ పెద్దిపల్లి గ్రామం వెళ్లే దారిలో పాలకొయ్యల వద్ద మంగళవారం గ్రావెల్‌తో రోడ్డు మరమ్మతు పనులను నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలకు రోడ్డు అధ్వాన్నంగా తయారై రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయాన్ని గ్రామస్తులు పంచాయతీ ప్రత్యేక అధికారి, మణుగూరు తహసీల్దార్ రాఘవరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించిన ఆయన గ్రావెల్‌తో రోడ్డు మరమ్మతు పనులు చేపిస్తున్నారు. ఇందుకు గాను గ్రామస్తులు తహసీల్దార్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే పంచాయతీ పరిధిలోని రామానుజవరం, కొండాయిగూడెం, కొత్తమల్లేపల్లి, అయోధ్యనగర్, శ్రీకృష్ణాపురం, ఇతర అవసరమైన ప్రదేశాల్లో గ్రావెల్ పోసి మరమ్మతులు చేపట్టాలని వారు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మాజీ సర్పంచ్ బాడిశ సతీష్, నోముల రవి, బాడిశ నాగేష్, బొల్లం చిన్న బాధర్, డేగల కృష్ణారావు, శ్రీకాంత్, నరసింహరావు, మండవ ప్రసాద్, సాధిని గోవర్ధన్, పాషా, పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే..



గుంతలమయంగా మారిన పోకలగూడెం గ్రామంలోని రోడ్డు

చంద్రుగొండ: మండలంలోని పోకలగూడెం గ్రామంలోకి వెళ్లే బీటీ రోడ్డు గంతలమయంగా మారింది. దీంతో చినుకు పడితే.. చిత్తడిగా మారుతుంది. ఇటీవలకాలంగా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరుతోంది. వాహనాల రాకపోకలకు జనంపై బురదనీళ్లు చిందుతున్నాయి. ప్రజలకు ఇబ్బందిగా మారిన గుంతలను శాఖాధికారులు సత్వరమే మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మహిళల హక్కుల సాధనకు పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల వెంకటేశ్వర్లు

బూర్గంపాడు: మహిళల హక్కుల సాధన కోసమే ఐద్వా పోరాటాలు కొనసాగిస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు. సారపాకలోని సుందరయ్యనగర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. మహిళల హక్కుల కోసం, మహిళల సంరక్షణ కోసం ఐద్వా నిరంతర పోరాటాలను కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు పాపినేని సరోజిని, ఎస్‌కె.అబీదా, కొలురి నాగమణి, కొప్పుల పుష్ప, పద్మ, రాధ, నూర్జాన్, రమాదేవి,రమణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ



రగ్గులు అందజేస్తున్న దృశ్యం

ములకలపల్లి: తిమ్మంపేటతోపాటు, సమీప గ్రామాలకు చెందిన పలువురు వృద్ధులకు రగ్గలను వితరణగా అందజేశారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి జలగం లీలా సంతోష్ కుమార్ చేతుల మీదుగా వంద మందికిపైగా వృద్ధులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లాలాసంతోష్ మాట్లాడుతూ.. మిత్రులు దీప, విజయ్‌ఆనంద్, అభ్రజిత్, ఓం ప్రకాశ్‌ల సహకారంతో రగ్గులను సమీకరించినట్లు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, హెచ్‌ఎం బి.శంకర్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మధుసూధన్, గోపి, జోగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉష్ణోగ్రతల మార్పు.. పిడుగు ముప్పు

- అకాల వర్షాలు.. భయపెడుతున్న ఉరుములు, మెరుపులు
- వరుసగా పలు చోట్ల పిడుగుపాట్లు
- అప్రమత్తతే శరణ్యమంటున్న నిపుణులు



భద్రాచలంఅర్బన్: ప్రస్తుతం వాతావరణంలో మార్పులు అంచనా వేయలేని పరిస్థితి. తీవ్రమైన ఎండలు, అంతలోనే భారీ వర్షాలు పడుతున్నాయి. ఓ కాలనీలో వర్షం కురుస్తుంటే.. పక్కకాలనీలో చినుకు కూడా పడని పరిస్థితులు చూస్తున్నాం. వాతావరణంలో వస్తున్న మార్పులతో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. విపరీత వాతావరణ పరిస్థితుల్లో ఎప్పుడు ఏ రకం వానలు కురుస్తాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే వాటితోనే ఉరుములు, మెరుపులు, పిడుగులు సహజంగానే వస్తాయి. పిడుగులకు బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే మనుషులతో పాటు జంతువులూ చనిపోతాయి. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. భద్రాద్రి జిల్లాలో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో పిడుగులు పడి ప్రాణ, ఆస్తి నష్టం జరిగిన సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. గత నెల 25 న దమ్మపేట లో పిడుగుపాటకు ఒకేసారి ఇద్దరు యువతులు మృతి చెందారు. జాగ్రత్తలతోనే ఇలాంటి పరిస్థితుల నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుంది.

పిడుగు అంటే..

చుట్టూ ఉన్న గాలిలో సుమారుగా 30వేల డిగ్రీల సెంటీగ్రేడ్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అదే మెరుపులా వేడెక్కిన గాలి ఒక్కసారిగా వ్యాకోచం చెందితే పెద్ద శబ్దం వస్తే అదే ఉరుము. ఒక్కోసారి మెరుపుతో కూడిన విద్యుత్ భూమి మీదకు చేరుతుంది. దాన్నే పిడుగు అంటారు. ఆకాశంలో శబ్దాలకు చర్మం జలదరింపునకు గురవుతున్నా.. దగ్గరలో లోహ వస్తువులు ఊగుతున్నా పిడుగుపాటుకు సంకేతంగా భావించాలి.

ఈ జాగ్రత్తలు పాటించాలి..

వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే ఉత్తమం. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. సాధారణంగా ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాలపైనే పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. ఉరుములు, మెరుపులు వస్తుంటే ఎత్తయిన చెట్లు, సెల్ టవర్లు, స్తంభాల వద్దకు వెళ్లకూడదు. మెరుపు లేదా పిడుగు కాంతిని చూసే ప్రయత్నమూ చేయకూడదు. పిడుగుకు కొన్ని మిలియన్ మెగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. పిడుగు పడే అవకాశం ఉన్న సమయంలో రైతులు వెంటనే సురక్షిత ప్రాంతానికి చేరుకోవాలి. ఒక వేళ వీలు కాకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి మోకాళ్లపై చేతులు, తల పెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. ఉరుములు ఉన్నప్పుడు టీవీ, ట్యాప్‌ట్యాప్, రిఫ్రిజిరేటర్, సెల్ఫోన్ వంటి వాటిని వినియోగించక పోవడం ఉత్తమం. ఆరు బయట ఉండడం, స్నానం చేయడం మంచిదికాదు. లోహపు వస్తువుల ద్వారా విద్యుత్ ప్రవహించే అవకాశాలు అధికం.

అప్రమత్తత అవసరం



వర్షాలు కురుస్తున్న సమయంలో ఎత్తయిన ప్రదేశాలకు, చెట్ల కిందకు వెళ్లరాదు. పిడుగు పడే అను మానం ఉంటే బహిరంగ ప్రదేశంలో భూమిపై కూర్చోవాలి. కూర్చున్నాక చెవులు మూసుకోవాలి. ధ్వని శబ్దం గుండెకు చేరకుండా జాగ్రత్తపడాలి. సెల్ఫోన్లు వాడకూడదు. ఉరుములు మొదలైతే వీలైనంత త్వరగా ఇళ్లకు చేరుకోవాలి.

– డాక్టర్ రామకృష్ణ, సూపరింటెండెంట్, భద్రాచలం ఏరియా ఆస్పత్రి

రహదారి విస్తరణ పనులు ఎప్పుడు?



మండల కేంద్రంలోని ప్రధాన రహదారి

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులకు రెండు ఏండ్లుగా మోక్షం కలగడం లేదు. భారజల కర్మాగారం, సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మ మండల కేంద్రంలో రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ, సెంట్రల్ లైటింగ్ , రహదారి విస్తరణకు గత ప్రభుత్వం రెండు ఏండ్ల క్రితం రూ.4 కోట్లు మంజూరు చేసింది. 2022 డిసెంబర్ 5న అప్పటి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన నెలల తరబడి పనులు ప్రారంభం కాలేదు. శంకుస్థాపన చేసిన ఆరు నెలల తర్వాత ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. అసెంబ్లీ ఎన్నికల ముందు డ్రెయినేజీ పనులు శరవేగంగా పూర్తి చేశారు. ఎన్నికల ముందే పనులు ప్రారంభమైనా సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ పనులు చేపట్టలేదు. అసెంబ్లీ ఎన్నికలు ముగియడం నూతన ప్రభుత్వం ఏర్పాటు కావడం అనంతరం పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాయి. రెండేళ్లయినా సెంట్రల్ లైటింగ్, డివైడర్ నిర్మాణం, రహదారి విస్తరణకు మోక్షం కలగడం లేదు. మండల కేంద్రంలో వాహనాల రద్దీ, మండల వ్యాప్తంగా ప్రజలు మండల కేంద్రానికి రావడం వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణ చేపడితే వాహనదారులకు, మండల కేంద్ర ప్రజలకు కష్టాలు తీరుతాయి. అధికారులు స్పందించి మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని సెంట్రల్ లైటింగ్, రహదారి విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టేలా చర్యలు చేపట్టాలని మండల కేంద్ర ప్రజలు కోరుతున్నారు.

గాలికుంటు టీకాలు ప్రారంభం

భద్రాచలంటౌన్: పశువులలో సోకే గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి పురంధర్ మాట్లాడుతూ.. ఈ నెల 15వ తేదీ నుండి నవంబర్ 14వ తేదీ వరకు నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పశువులకు ఈ వ్యాధి సోకితే సంబంధిత రైతులు టీకాలను వేయించాలని, పశువులు కలిగిన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

మూలమలుపులు.. పిచ్చిమొక్కలు



గుండాల-లక్ష్మీపురం రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు

గుండాల: మండలంలోని ప్రధాన రహదారులను పిచ్చిమొక్కలు కమ్మేస్తున్నాయి. అసలే మూల మలుపులు.. ఆపై వాటి వద్ద సూచిక బోర్డులు లేకపోగా మధ్యలో గుబురుగా పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో ఎదురుగా వచ్చిన వాహనాలు ఢీకొనడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు సూచిక బోర్డులు మరిచిపోగా, పంచాయతీ అధికారులు పిచ్చిమొక్కలను తొలగించడం లేదు. మండల కేంద్రం నుంచి సాయనపల్లి, గుండాల-లక్ష్మీపురం, గుండాల-వెన్నెలబైలు రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి.

గ్రామ పంచాయతీ అధికారులు వాటిని తొలగించడం లేదని వాహనదారులు వాపోతున్నారు. అంతేకాకుండా మార్గం మధ్యలో మూలమలుపులు అనేకం. సూచిక బోర్డులు అమర్చలేదు. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించి, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.



గుండాల-సాయనపల్లి రోడ్డు..

జిల్లా కిసాన్ ఉపాధ్యక్షుడి తొలగింపు

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన జిల్లా కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దర్శి సాంబశివరావును ఆ పదవి నుంచి తొలగిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఏలూరి కోటేశ్వరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దర్శి సాంబశివరావుకు వ్యతిరేకంగా అనేక ఫిర్యాదులు రావడంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులకు, పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నట్లు విచారణలో తెలియడంతో పదవి నుంచి తొలగించినట్టు వివరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న తహసీల్దార్, ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ అధ్యక్షతన ఎమ్మెల్సీ (ఉపాధ్యాయ) ఎన్నికలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మండలంలోని అన్ని యాజమాన్యాల హైస్కూల్ హెచ్‌యంలు, కాలేజీ ప్రిన్సిపాల్‌లు పాల్గొన్నారు. సదస్సులో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు ఏవీ రామారావు, ఏజే ప్రభాకర్, సావిత్రి, సోమశేఖర్, మోతీర్, శోభారాణి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భర్త కలను నిజం చేసిన భార్య!



సునీత

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన రైతు నిర్మలా మల్లికార్జున్ రావు కుమార్తె నిర్మలా సునీత ఎస్జీటీగా సర్కార్ ఉద్యోగాన్ని సాధించింది. ఇంజనీరింగ్ విద్యను అభ్యసించిన సునీత, పెళ్లి తర్వాత తన భర్త బ్రహ్మానాయుడు ప్రోత్సాహంతో తిరిగి టీటీసీ చదివింది. ఇటీవలె విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఆమెకు 50వ ర్యాంక్ రాగా, ఎస్జీటీగా నియామక పత్రాన్ని అందుకుంది. తాజాగా మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగిన కౌన్సిలింగ్‌లో ఆమెకు దమ్మపేట మండలం గట్టుగూడెం ప్రభుత్వ పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారు.

రెవెన్యూ గ్రామంగా మార్చాలి

అశ్వాపురం: మండలంలో నెల్లిపాక రెవెన్యూ గ్రామం అతి పెద్దది అయినందున అందులో భాగమైన మొండికుంట గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా చేయాలని మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మొండికుంటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వీఆర్‌ఓ వ్యవస్థ ఉన్నప్పుడు నెల్లిపాక రెవెన్యూలో రెండు సర్వే నంబర్లు విడదీసి నెల్లిపాక-1, నెల్లిపాక-2గా ఇద్దరు వీఆర్‌ఓలను నియమించడం జరిగిందన్నారు. రెవెన్యూ వ్యవస్థ రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండాలంటే మొండికుంట గ్రామాన్ని తక్షణమే నూతనంగా రెవెన్యూ గ్రామంగా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యమకారులపై దాడులు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

మణుగూరుటౌన్: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా తమ హక్కుల కోసం పోరాటం కొనసాగించే ఉద్యమకార్లు, మేధావులపై కక్షపూరితంగా కేసులు పెట్టడం, దాడులు చేయడం మానుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా అన్నారు. మంగళవారం మణుగూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. అధికారం ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం వారి హక్కుల కోసం పోరాటాలు సాగిస్తామన్నారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అయోధ్య మాట్లాడుతూ.. శత దినోత్సవ వేడుకలు అందరూ శ్రమించి ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకన్న, రేసు ఎల్లయ్య, మున్నా లక్ష్మీకుమారి, సరెడ్డిపుల్లారెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్, లక్ష్మీనారాయణ, జంగం మోహన్‌రావు, సుధాకర్, సురేశ్, రాజు, సతీష్, సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

అశ్వారావుపేటరూరల్: పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నేటి(బుధవారం) నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు ఉచిత పశు వైద్య శిబిరాలతోపాటు, పశువులకు గాలికుంట నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ మండల వైద్యాధికారిణి ఎం.స్వప్న తెలిపారు. ఈ మేరకు ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 17,178 పశువులు (తెలుపు, నలుపు) ఉన్నాయని, వీటికి వైద్య సేవలతోపాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు చెప్పారు. గ్రామాల వారిగా ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తామని, ఆయా గ్రామాల్లోని పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరాల్లో భాగంగా తొలి రోజు మండలంలోని నారాయణపురం, 17వ తేదీన మల్లాయిగూడెం, పండువారిగూడెం, 18వ తేదీన అనంతారం, రామన్నగూడెం, గాండ్లగూడెం, 19వ తేదీన కావడిగుండ్ల, 21వ తేదీన కన్నాయిగూడెం, 22న గుమ్మడవల్లి, 23న కోయ రంగాపురం, బచ్చువారిగూడెం, ఖమ్మంపాడు, 24న వేదాంతపురం, ఊట్లపల్లి, 25న వినాయకపురం, ఆసుపాక, 26న గుంటిమడుగు, 28న నందిపాడు, దురదపాడు, 29న మొద్దులమడ, సున్నంబట్టి, 30వ తేదీన తిరుమలకుంట, రెడ్డిగూడెం, నవంబర్ 1వ తేదీ మామిళ్లవారిగూడెం, అచ్యుతాపురం, 2వ తేదీన మద్దికొండ, జమ్మిగూడెం, 4వ తేదీన నారంవారిగూడెంలో ఈ పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తామని వివరించారు. పశు సంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా అందించే సేవలు, గాలికుంటు టీకాలను యజమానులు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

పశువులకు టీకాలు వేయించాలి

దమ్మపేట: పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని, దమ్మపేట పశు వైద్యురాలు స్వప్న మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాలికుంటు వ్యాధి వల్ల పశువులు మేత మేయకపోవడం, పాల దిగుబడి తగ్గడం, కుంటుతూ నడవటం వంటి లక్షణాలు కనిపిస్తాయని పేర్కొన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి పశు సంవర్ధక శాఖ సిబ్బంది టీకాలు వేయు నిమిత్తం వస్తున్నారని, రైతులు ఈ విషయాన్ని గమనించి గేదెలు, ఆవులు, దూడలు, దుక్కి ఎడ్లు తదితర పశువులకు విధిగా టీకాలు వేయించుకోవాలని కోరారు.

మంత్రికి వినతుల వెల్లువ



మణుగూరురూరల్: మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేస్తున్న ఐజేయూ సభ్యులు



అశ్వాపురం: మంత్రి పొంగులేటికి విన్నవిస్తున్న అఖిలపక్షం నాయకులు

మణుగూరురూరల్: పినపాక నియోజకవర్గంలోని అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ మణుగూరు పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో మంగవారం వినతిపత్రం అందజేశారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యూజే (ఐజేయూ) పినపాక నియోజకవర్గ అధ్యక్షులు పూజారి చందు, సభ్యులు షాబీర్‌పాషా, మిట్టపల్లి శ్యామ్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇళ్లు మంజూరు చేయాలి..

సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని, మణుగూరు ఏరియాలో కొత్త గనులను ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మణుగూరు పర్యటనలకు వచ్చిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఇఫ్టూ నాయకులు మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు వినతిపత్రం అందజేశారు. అనంతరం సింగరేణి లాభాల వాటాలో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5వేలు ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రిని శాలువాతో సన్మానించి జ్ఞాపికతో సత్కరించారు. కాంట్రాక్ట్ సూపర్‌వైజర్లు, కార్మికులు ఎం.హతిరామ్, రమేష్, డి.అనూష, అలివేలు, మేరి, లక్ష్మి, నిర్మల, సుశీల, ఉపేంద్ర, శ్రీరాములు, రామకృష్ణ, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంటను మండల కేంద్రంగా చేయాలని మాజీ ఎంపీటీసీ కమటం నరేష్ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీల నాయకులు మొండికుంటలో మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు పరిపాలన సౌలభ్యం కోసం అన్ని వసతులు ఉన్న మొండికుంటను మండల కేంద్రంగా చేయాలని మంత్రికి నాయకులు విన్నవించారు. అఖిలపక్ష పార్టీల నాయకులు కమటం వెంకటేశ్వరరావు, సుధాకర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ..

మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పులసాని రామిరెడ్డి కుమారుడు మహేష్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా మంగళవారం మొండికుంటలోని వారి నివాసంలో మహేష్‌రెడ్డి చిత్ర పటానికి మంత్రి పొంగులేటి పూల మాల వేసి నివాళులు అర్పించారు. రామిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని రామిరెడ్డి కుటుంబానికి మంత్రి భరోసా కల్పించారు. ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయండి

కరకగూడెం: మండలంలోని పలు ఐటీడీఏ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడిందని సీపీఎం మండల కార్యదర్శి కొమరం కాంతారావు మంగళవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల కొంతమంది ఉపాధ్యాయులు బదిలీకాగా వారి స్థానంలో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను సర్దుపాటు చేయకపోవడంతో విద్యార్థుల చదువులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు.అంతేకాకుండా వెంటనే ఉపాధ్యాయులను సర్దుపాటు చేసి సమస్యను పరిష్కరించాలని సంబంధిత శాఖధికారులను కోరారు.

నేలను తాకిన మబ్బులు



సూర్యాస్తమయంలో కనువిందు చేస్తున్న ఆకాశం

కరకగూడెం: సూర్యాస్తమయం సమయంలో ప్రతిరోజు ప్రకృతి మనకు ఏక్కడో ఓ చోట అద్భుత చిత్రాన్ని అందిస్తుంది. అందులో భాగంగా ఎర్రటి, నారింజ రంగుల్లోని ఆకాశంలో నల్లని మబ్బులు భుముని తాకాయా అన్నట్లు ఈ చిత్రం కనువిందు చేస్తోంది. సూర్యుడు పొద్దంతా అలసి అస్తమిస్తున్న క్రమంలో మంగళవారం కరకగూడెం రైస్మిల్ సమీపాన మిర్చి మల్చింగ్ సాగు చేస్తున్న పొలాల నడుమ ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. వాతావరణ మార్పులతో ఏర్పడిన చూపరులను ఆకట్టుకుంది. 'సాక్షి' ఈ దృశ్యాలను తన కెమెరాలో బంధించింది.